క్లుప్తంగా

వైభవంగా ఉరుసు


విద్యుదీపాలంకరణలో దర్గా

మంత్రాలయంరూరల్: మండల కేంద్రంలోని నాగలదిన్నె రహదారిలో వెలసిన సుంకప్ప తాత ఉరుసు వైభవంగా నిర్వహించారు. మంత్రాలయం గ్రామ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాలవారు దర్గా వద్దకు వచ్చి తాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా తాత దర్గాకు వెళ్లే రహదారికి ఇరువైపులా గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో ముళ్లకంపలు తొలగించారు. దర్గాకు విద్యుదీపాలంకరణ చేపట్టారు. గ్రామంలోని ప్రజా ప్రతినిధులు తాత సమాధిని దర్శించుకుని ఫాతెహాలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఈ నెల 7న ఓర్వకల్లులో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నిరుద్యోగులకు సూచించారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ, సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ సంయుక్తంగా ఓర్వకల్లు మండలంలోని మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంతో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కాటసాని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. జాబ్ మేళాలో 15 కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆయా పోస్టులకు పదవ తరగతి నుంచి పీజీ వరకు అర్హతలు ఉన్నా నిరుద్యోగులు http://surl.li/efykz వైబ్‌సైట్ చూడలన్నారు. మరింత సమాచారం కోసం 63003 73877, 75690 68058 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పింజరి సుభాన్ (ఫైల్)

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన పింజరి సుభాన్ (30) చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. వివరాలు.. పెద్దమరివీడు గ్రామానికి చెందిన పింజరి సుభాన్ కడుపునొప్పి తాళలేక డిసెంబర్ 29న మధ్యాహ్నం ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సుభాన్‌ను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సంవత్సరం క్రితం అతని భార్య హసీనా అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి అన్న పింజారి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

అనాథలైన చిన్నారులు

పెద్దమరివీడు గ్రామానికి చెందిన పింజరి సుభాన్, హసీనాలకు కుమారుడు ఇర్ఫాన్ (5), కుమార్తె అప్సనా (3) ఉన్నారు. దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. సంవత్సరం క్రితం హసీనా, ప్రస్తుతం సుభాన్ మృతిచెందడంతో పిల్లలు అనాథలుగా మిగిలారు. ప్రస్తుతం సుభాన్ తల్లి కాశింబీ వద్ద పిల్లలు ఉన్నారు. అనాథలుగా మిగిలిన చిన్నారులను ఎవరైనా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా చంద్రప్రభ వాహన సేవ


వేంకటేశ్వర స్వామికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని తిరుమల నగర్ శ్రీ వెంకటసాయి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి గజ, చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. తిరుమలనగర్ దేవాలయం నుంచి బయలుదేరిన పల్లకి ఓంశాంతి సర్కిల్ పట్టణ పురవీధుల్లో ఊరేగింది. భక్తులు భజన పాటలు పాడుతూ, కోలాటం వేస్తూ భక్తిని చాటుకున్నారు. దేవాలయంలో పండ్లు, పూలతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం మహా రథోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు యు.శ్రీనివాసులు తెలిపారు. అలాగే పట్టణంలోని ట్యాంక్‌బండ్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

పింఛను పండుగ


కోసిగిలో వృద్ధురాలు లక్ష్మమ్మకు పింఛను అందిస్తున్న ఎంపీపీ ఈరన్న,


పెద్దకడబూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీవిద్య, రామ్మోహన్ రెడ్డి


మంత్రాలయంలో కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులు

కోసిగి: మాట ఇచ్చాక ఎన్ని అడ్డంకులు ఎదురైనా నెరవేర్చి తీరడం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నైజం అని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. కోసిగిలో ఆదివారం వాడవాడలా తిరిగి లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛను సొమ్మును విడతల వారీగా పెంచుతూ ప్రస్తుతం రూ.2,750 అందిస్తున్నారని గుర్తు చేశారు. లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించి అవ్వా తాతలను పలకరించి సీఎం జగనన్న పరిపాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఫింఛన్ రావాలంటే పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉదయం నుంచి సాయంకాలం వరకు వేచి ఉండే పరిస్థితి తొలగించి ప్రతి నెలా 1వ తేదీన వేకువ జామున వలంటీర్లు ఇంటి తలుపుకొట్టి పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో కన్వీనర్ల చేతుల మీదుగా వలంటీర్లు పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పెద్దభూంపల్లి గ్రామంలో లబ్ధిదారులు సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు మాణిక్యరాజు, నాడుగేని నాగరాజు, బుళ్లి నరసింహులు, లోకా రెడ్డి, పెల్ల భూంపల్లి లక్ష్మీరెడ్డి, గట్టు భీముడు, అంజినయ్య తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ముఖాల్లో ఆనందం

పెద్దకడబూరు: పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జనవరి 1వ తేదీ పింఛన్‌ను రూ.2750కు పెంచిన పండుగ రోజు అని చెప్పారు.


ఆదోని 1వ వార్డులో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్, పింఛను లబ్ధిదారులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటిస్తున్నాడని కొనియాడారు. వైస్ ఎంపీపీ పరమేష్‌గౌడ్, కల్లుకుంట గ్రామ సర్పంచ్ ఇస్మాయిల్, వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

మంత్రాలయం రూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ సొమ్ము విడతల వారీగా పెంచుతూ రూ.2,750 చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి పింఛన్ సొమ్ము అందజేశారు. వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కౌతాళం: మండలంలో నూతన సంవత్సరం ప్రారంభం రోజున ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పండుగ నెలకొంది. సచివాలయం -2లో కార్యదర్శి ఆంజనేయులు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. మండలానికి 322 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. పింఛను సొమ్ము రూ.250 పెంచి ఇవ్వడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

తెల్లారకముందే పింఛన్ల పంపిణీ

ఆదోని అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ సొమ్ము విడతల వారీగా పెంచుతూ రూ.2750 చేయడంలో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆయా వార్డుల్లో సచివాలయ వార్డు వలంటీర్లు, కౌన్సిలర్లు, కన్వీనర్లు వేకువజామునే తలుపు తట్టి అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించి రూ.2,750 పింఛన్ సొమ్ము అందజేశారు.


కౌతాళంలో బాలుడు అమృతరాజుకు పింఛన్ పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు


ఖాజీపూర్‌లో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న కౌన్సిలర్ ఇంతియాజ్, వలంటీర్ కృష్ణ

1వ వార్డు వాల్మీకి నగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత పింఛన్ సొమ్ము అందజేసి సంక్షేమ పథకాలను వివరించారు. అవ్వాతాతలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంతోషం వ్యక్తం చేశారు. వృద్ధులతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్‌లు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు. అదేవిధంగా ఖాజీపూర్‌లో 33వ వార్డు కౌన్సిలర్ ఇంతియాజ్‌బాషా, వలంటీర్ కృష్ణ వృద్ధులకు పింఛన్ అందజేశారు.

సన్మార్గంలో నడవాలి

పెద్దకడబూరు: ప్రతి ఒక్కరూ పాపపు జీవితాన్ని వదలి సన్మార్గంలో నడవాలని సీఎస్ఐ చర్చ్ పాస్టర్ ముత్తు మనోహర్‌బాబు అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో బాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రార్థనలు చేశారు. ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటి వారికి సహాయం చేయాలన్నారు. వేడుకల్లో వైస్ ఎంపీపీ పరమేష్‌గౌడ్, కోసిగి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, నాయకులు గజేంద్రరెడ్డి అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.


పాస్టర్ ముత్తు మనోహర్‌బాబుకు కేక్ తినిపిస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదోని అర్బన్: స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నూతన సంవత్సరం 2023 క్యాలెండర్‌లను ఆదివారం ఎస్టీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప, సీనియర్ నాయకుడు శివన్న, నాగప్రసాద్, శ్రీనివాసులు క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేడాది ఎస్టీయూకు సంబంధించిన డైరీలు, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. క్యాలెండర్‌లో వేద పండితుల చేత ముద్రించబడిన పండుగలు, సెలవు దినాలు, డైరీలో స్వీట్ మెమోరీస్‌లను రాసుకోవచ్చన్నారు. నాయకులు హనుమన్న, జ్యోతిమూర్తి, అహ్మద్, రామాంజనేయరెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ఆదోని కాపు, తెలగ బలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ లక్ష్మినరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం అధ్యక్షుడు టి.లక్ష్మన్న, కార్యదర్శి భీమ, కార్యవర్గ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపు, బలిజలు ఐకమత్యంతో ఉంటూ అన్ని రంగాల్లో రాణించి, కొత్త సంవత్సరంలో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె.రంగస్వామి, చందం మల్లి, గోపాలకృష్ణ, దుబాయ్‌శీను, సతీష్, ల్యాబ్ రామాంజనేయులు, పాల రంగన్న, నాగేంద్ర అడ్వకేట్, సంజన్న, ప్రభు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


కాపు, బలిజ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నూతన సంబరాలు


ఆదోనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కమిషనర్, ఎంఈ

ఆదోని అర్బన్: నూతన సంవత్సరం వేడుకలు పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ఆదోని చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలవాసులు, నాయకులు పట్టణానికి చెందిన అధికారులు, వ్యాపారవేత్తలు, ప్రజలు నాయకులు పూలగుచ్ఛం, పూలమాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణం తదితర అధికారులు ఎమ్మెల్యేకు బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత కేకు కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

మంత్రాలయం రూరల్: కొత్త ఏడాది నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వై.సీతారామిరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమ నిలయంలో మంత్రాలయం మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య నాయకలు జనార్ధన్ రెడ్డి, వీకేసీ రఘు వై.సీతారామిరెడ్డిని కలిసి పూలమాల వేసి బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది ప్రజలకు మరెన్నో సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలలు కన్న గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా పని చేసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి మంచి గుర్తింపు తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు నాయకులు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కోసిగి: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి యువతీ యువకులు, నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు కలుసుకుని నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. కోసిగిలో ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మాజీ జెడ్పీటీసీ, మహిళా మండల నాయకురాలు దళవాయి మంగమ్మ, నాయకులు మాణిక్యరాజు, మహాంతేష్ స్వామిలను పలువురు అభిమానులు కార్యకర్తలు కలిసి పూజల మాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లను కట్ చేసి కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని దేవుడిని ప్రార్థించారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 2023 ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని ఆదివారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీఓ వెంకటరమణ, సిబ్బంది, వివిధ మండల స్థాయి అధికారులు సింగిల్‌విండో అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరిని వారివారి స్వగృహాలలో కలుసుకొని శుభకాంక్షలు తెలిపారు. వ్యవసాయాధికారి వరప్రసాద్ తమ సిబ్బంతో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మండలి సభ్యులతో కలసి కేక్ కట్‌చేసి శుభకాంక్షలు తెలుపుకున్నారు.


కోసిగిలో మహిళా నాయకురాలు మంగమ్మను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆదోనిలో మున్సిపల్ అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ బోయ శాంత


మంత్రాలయంలో వై.సీతారామిరెడ్డికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మండలస్థాయి క్రికెట్ టోర్నీ

కోసిగి: మండల కేంద్రం కోసిగి శ్రీ రేణుక ఎల్లమ్మ అలయ గ్రౌండ్‌లో దివంగత క్రీడకారుడు సురేష్ జ్ఞాపకార్థం స్నేహితులు మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. సురేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. సురేష్, వాలీబాల్, క్రికెట్‌లో మంచి ప్రావీణ్యం కనబరస్తు తోటి స్నేహితుల్లో మంచి స్థానం ఏర్పరచుకున్నాడు. స్నేహితుడు లేని లోటు తీరనిదిగా అయన జ్ఞాపకార్థం కృష్ణ, నరసింహులు, విక్కీ, వెంకీ తదితరులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న క్రీడాకారులు

వైభవంగా యోగి నరసింహ స్వామి రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామ సమీపంలోని తోటలో వెలసిన మహాత్మా యోగి నరసింహస్వామి రథోత్సవం అశేష భక్తజనుల మధ్యన ఆదివారం వైభవంగా జరిగింది మేళ తాళాలు నడుమ స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. తేరుపైకి భక్తాదులు అరటి పండ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిరు వ్యాపారులు పలురకాలైన స్వీట్ దుకాణాలు, గాజుల అంగళ్లు, రంగుల రాట్నాలు ఏర్పాటుచేశారు. కుటుంబ సమేతంగా హాజరైన భక్తులతో తోట కిక్కిరిసిపోయింది.

భక్తుల అవస్థలు

వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వామివారి దర్శనార్థం స్కూటర్లు, జీపులు, ఆటోలు, వివిధ వాహనాల్లో భారీగా భక్తులు తరలివచ్చారు. హంద్రీ నీవా ప్రధాన కాలువ గుండా వెళ్లే దారి మొత్తం వాహనాలతో నిండిపోయి ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.


భక్తజనుల మధ్య కొనసాగుతున్న రథోత్సవం

ఇద్దరు కమీషన్ ఏజెంట్ల లైసెన్సు సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులను దగా చేసిన ఇద్దరు కమీషన్ ఏజెంట్ల లైసెన్స్‌లను వారం రోజుల పాటు సస్పెండ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తూ సెక్రటరీ గోవిందు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 31న కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన నారాయణ లలితాదేవి ట్రేడర్స్, కమీషన్ ఎజెంటు దగ్గర కందులు, రాకేష్ ట్రేడింగ్ కంపెనీ కమీషన్ ఏజెంటు దగ్గర ఆముదాలు అమ్మకానికి పెట్టారు. వ్యాపారులు ఈ-నామ్‌లో కొనుగోలు చేశారు. ఇద్దరు కమీషన్ ఏజెంట్లు హమాలీ చార్జీల కింద వసూలు చేయాల్సిన మొత్తం కంటే ఎక్కువగా వసూలు చేశారు. దీనిపై రైతు నారాయణ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై పాలకవర్గం చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సెక్రటరీ గోవిందు విచారణ జరిపించారు. విచారణలో రైతును దగా చేసినట్లు తేలింది. దీంతో కమీషన్ ఏజెంటుల లైసెన్స్‌ను ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు సస్పెండ్ చేయడంతో పాటు రూ.5000 ప్రకారం జరిమానా విధించారు. సంబంధిత రైతుకు దగా చేసిన మొత్తానికి రెట్టింపు చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

కర్నూలు(అర్బన్): నూతన సంవత్సరంలో జిల్లాలోని బీసీలు రాజకీయంగా మరింత ముందడుగు వేయాలని బీసీ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం 2023 నూతన సంవత్సరం పురస్కరించుకొని స్థానిక బీసీ భవన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మికాంతయ్య, పార్వతమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సిద్ధం

– నేడు వైష్ణవ ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం

ఆదోని అర్బన్: వైకుంఠ ఏకాదశి వేడుకలకు వైష్ణవ ఆలయాలు ముస్తాభయ్యాయి. సోమవారం తెల్లవారుజామున వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేలా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. స్థానిక తిరుమలనగర్‌లో వెలిసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు దర్శనం కోసం ఆలయం బయట, లోపల బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారి ఉత్తర ముఖ దర్శనం చేసుకోవడం వల్ల వైకుంఠప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. సోమవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


విద్యుదీపాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి ఆలయం


బావాజీమఠంలో భూదేవిశ్రీదేవి సమేత వెంకటేశ్వర స్వామి

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు స్వామివారికి రుద్రాభిషేకంతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహా మంగళారతితో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం సైకిల్ యాత్ర


సైకిల్ యాత్ర చేపట్టిన గుర్రం చైతన్యకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఎమ్మిగనూరుటౌన్: ప్లాస్టిక్ రహిత సమాజం, పర్యావరణ పరిరక్షణ కోసం నెల్లూరుకు చెందిన ఆర్యవైశ్య గుర్రం చైతన్య గత డిసెంబర్‌లో ప్రారంభించిన సైకిల్ యాత్ర ఆదివారం ఎమ్మిగనూరుకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు మరో 26 రాష్ట్రాల మీదుగా తాను చేపట్టనున్న సైకిల్ యాత్ర 5 వేల కిలోమీటర్ల మేర దాదాపు ఏడాదిన్నర పైగా కొనసాగిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సైకిల్ యాత్ర చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణానికి వచ్చిన ఆయనకు ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా స్వాగతం పలికి వాసవీ కళ్యాణ మండపంలో సన్మానించారు. అనంతరం మంత్రాలయం రహదారి వద్ద వీడ్కోలు పలికారు. ఆర్య వైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.